


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 152 | ఆదివారం 9 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50



## బీహార్‌కు తుపాకుల ప్రభుత్వం అక్కర్లేదు

### ప్రధాని మోడీ

**బీహార్, సూర్య వాస్తవం:** బీహార్‌కు తుపాకుల ప్రభుత్వం అక్కర్లేదు అని మహాగట్బంధన్‌ను ఉద్దేశించి ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. బీహార్ రెండో దశ ఎన్నికలకు ముందు ప్రముఖ నేతలందరూ ఆ రాష్ట్రంలో వాలిపోయి హోరాహోరీగా ప్రచారం సాగిస్తున్నారు. మహాగట్బంధన్‌కు మద్దతుగా శనివారం కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎ కూటమికి మద్దతుగా ప్రధాని మోడీ సీతామర్హిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. 'మాకు కట్టా (తుపాకుల) ప్రభుత్వం వద్దు ఎన్‌డిఎ ప్రభుత్వమే మరోసారి కావాలని బీహార్ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మొదటి దశ ఓటింగ్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓటింగ్ సరళిని చూసి జంగిల్ రాజ్‌కి 65 వోల్ట్ షాక్ కొట్టినట్లైంది అని మోడీ చురకలంటించారు.

# అన్ని రంగాల్లో.. రాష్ట్రాభివృద్ధే లక్ష్యం



- ముఖ్యమంత్రి చంద్రబాబు
- పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం
- కుప్పం నియోజకవర్గంలో 7 పరిశ్రమలకు సీఎం చేతుల మీదుగా వర్చువల్ గా శంకుస్థాపన
- రూ.2,203 కోట్లతో కుప్పంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు
- 22,330 మందికి ఉద్యోగాల లబ్ధి
- త్వరలో రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు రానున్నట్టు వెల్లడించిన సీఎం చంద్రబాబు

**కుప్పం, సూర్య వాస్తవం, నవంబర్ 8:**
అన్ని రంగాల్లోనూ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు , పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు వివరించారు. అలాగే చిత్తూరు జిల్లాలో వెనుకబడిన కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో 7 పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శని వారం శంకుస్థాపన చేశారు. హిందాల్కో, శ్రీజా డైరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డైరీ, ఇ-రాయస్ ఈవీ, అలీప్ పరిశ్రమలు కుప్పంలో రూ. 2,203 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. తద్వారా 22,330 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ ఏడు సంస్థలకు

- మిగతా 2లో..

## కురుబలను గుండెల్లో పెట్టుకుంటా!

- గుడికట్ల పూజారులకు గౌరవవేతనం అందిస్తాం
- భైరవానితిప్ప ప్రాజెక్టును మేమే పూర్తిచేస్తాం
- భక్త కనకదాస జయంతి సభలో మంత్రి నారా లోకేష్

**కళ్యాణదుర్గం, సూర్యవాస్తవం:** తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన కురుబ సోదరులను మరువం, గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శనివారం కళ్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి భక్త కనకదాస 538వ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్త కనకదాస విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరిం చారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ వారి మాట ల్లోనే... తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు అన్ని విధాలుగా టీడీపీకి అండగా నిలిచారు. ఇప్పుడు మేము బీసీలను బలోపేతం చేయడానికి అన్నివిధాలుగా కృషిచేస్తున్నాం. ఈ రోజు చాలా మంచి రోజు. మహా భక్తుడు కనకదాస గారి జయంతి. ఈ సందర్భంగా భక్త కనకదాస విగ్రహావిష్కరణ చేయడం, కనకదాస గారి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం నా జీవితంలో మార్చిపోలేని రోజు. ఒకే రోజు మూడు పండుగలను కురుబ సోదరులతో కలిసి





## ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యం

- ఎర్రచందనం కేవలం చెట్టు కాదు.. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆధ్యాత్మిక చిహ్నం
- ఎర్రచందనం అక్రమ రవాణాని స్వచ్ఛందంగా ఆపాలి
- అతిక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపుతాం
- నిలిపిన వారికి ఉపాధి కల్పనకు చర్యలు
- ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

**తిరుపతి, సూర్యవాస్తవం:** ఎర్రచందనం కేవలం చెట్టు కాదు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆధ్యాత్మిక చిహ్నమని, అతిక్రమించిన వారిపై ఉక్కు పాదం మోపుతామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణం, ఆర్ డబ్ల్యు ఎస్ శాస్త్ర మరియు సాంకేతిక శాఖామాత్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. శనివారం మద్యాహ్నం స్థానిక కల్లెక్టరేట్ లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్రం లో ఎర్ర చందనాన్ని రక్షించడం పై అటవీ శాఖ, పోలీస్ అధికారులతో ప్రిన్సిపాల్ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.పి వి చలపతి రావు,




- మిగతా 2లో..

మహాత్మాగాంధీ మాదిరిగానే..

## నేడు కాంగ్రెస్ పోరాటం



**తిహార్, సూర్యవాస్తవం :** ఓట్లు చోరీకి గురవుతున్న తరుణంలో మహాత్మాగాంధీ పోరాటం చేసినట్లుగానే కాంగ్రెస్, మహాగట్బంధన్‌లు పౌరుల హక్కులు, ఓటు హక్కు కోసం పోరాటం చేస్తున్నాయి అని కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ వాద్రా అన్నారు. బీహార్ రెండో దశ ఎన్నికల ముందు బీహార్‌లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. నేడు ప్రియాంకగాంధీ బీహార్‌లో కతిహార్‌లోని కద్వాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. 'నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్ పోరాటం కేవలం రాజకీయ పోరాటం మాత్రమే కాదు. ఓటు హక్కుతో సహా పౌరుల ప్రాథమిక హక్కుల కోసం చేసే పోరాటం' అని ఆమె అన్నారు. నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్ చేస్తున్న పోరాటం.. అప్పట్లో మహాత్మాగాంధీ చేసిన యుద్ధంలాంటిదే. మేము మీ హక్కుల కోసం, సత్యం కోసం ఒక సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాము. అదే నరేంద్రమోడీ సామ్రాజ్యమని తెలిపారు.




# ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)
జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర, ఎస్ పి ఎల్.సుబ్బరాయుడు లతో కలసి ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశ ముఖ్యాంశాలు**

అన్నమయ్య, కడప, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల పరిధిలో గల 17,053 చ.కి.మీల అటవీ ప్రాంతంలో 5300 చ.కి.మీ ల లో ఎర్ర చందనం విస్తరించి ఉంది,పరిపాలనా పరంగా అటవీ శాఖలో ఎర్రచందనం సంరక్షణకు తిరుపతి, పీలేరు, గుంటూరు, ఆత్మకూరు కేంద్రాలుగా 5 ఫ్లయింగ్ స్క్వాడ్ ల ఏర్పాటు,తిరుపతి, గుంటూరు, కర్నూలు, అనంతపూర్ లలో 80 బేస్ క్యాంప్ లు, 41 స్ట్రైక్ ఫోర్స్, 50 చెక్ పోస్ట్ లు, 692 మంది సిబ్బంది ఏర్పాటుతరచూ కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించి అక్రమ ఎర్ర చందనం రవాణాను అడ్డుకట్టకూలీలు, మేస్త్రీ, లాజిస్టిక్స్ సపోర్టర్, ట్రాన్స్పోర్టర్, గోడౌన్ కీపర్, ఎక్స్పోర్ట్ ల ద్వారా అంతర్జాతీయ స్మగ్లర్ లకు ఎర్ర చందనం రవాణా అవుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి కి వివరించిన అధికారులు ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడానికి అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంప్ లు, చెక్ పోస్ట్ లు, సి సి టి వి కెమెరా ల ద్వారా పర్యవేక్షణ డ్రోన్ మానిటరింగ్ స్టెయిన్ ల ఏర్పాటు చేసి థర్మల్ డ్రోన్స్ ద్వారా నిఘా ఎర్ర చందనం అక్రమ రావాదారుల పై పి డి యాక్ట్ అమలు.

**అటవీ శాఖల లో ఖాళీ పోస్ట్ ల భర్తీకి చర్యలు**

ఎర్ర చందనం అక్రమ రవాణా కట్టడికి తీసుకోవలసిన చర్యల పై కూలంకుషంగా చర్చ .. మున్ముందు అక్రమ రవాణా చేయాలంటే భయపడేవిధంగా చర్యలుండాలిలి జిల్లా ఎస్ పి ఎల్.సుబ్బరాయుడు, కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సి సెల్వం జిల్లాలో ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడం లో తీసుకుంటున్న చర్యలను ఉప ముఖ్యమంత్రి కి వివరించారు మఈ కార్యక్రమంలో అనంతపురం, కర్నూలు సర్కిల్ రేంజ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ లు యశోదా బాయి, ఎస్ వి ఏ కృష్ణమూర్తి, చిత్తూరు, అన్నమయ్య, కడప ఎస్ పి లు తుషార్ దూడి, ధీరజ్ కునుగులి , ఎస్. ఎన్ . విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డి ఎఫ్ లో సి.సాయిబాబా, కే వినోద్ కుమార్, కే.మహబూబ్ బాషా, వినీత్ కుమార్, జగన్నాథ్ సింగ్ లు, డి ఆర్ ఓ జి. నరసింహులు, ఇతర అటవీ, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)
241 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. పరిశ్రమల శంకుస్థాపన సందర్భంగా స్థానిక ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులతో ఆన్ లైన్లో ముఖాముఖి కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని, తన అధ్యక్షతన జరుగుతున్న రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన ఆమోదం ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. త్వరలో కుప్పం నియోజకవర్గానికి రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు రాబోతున్నాయని, వీటి రాకతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాయలసీమ జిల్లాల్లో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నట్టు సీఎం చెప్పారు. స్థానికంగా ఉన్న యువతకు స్కిల్ డెవలప్మెంట్ కల్పించేలా హిందాల్కో సంస్థ యూనిట్ ను ఏర్పాటు చేయనుందని సీఎం తెలిపారు. రూ.586 కోట్లతో శిక్షణా టెక్నికల్ శిక్షణా కేంద్రాన్ని హిందాల్కో నెలకొల్పనుంది. రూ. 290 కోట్ల వ్యయంతో సమీకృత డెయిరీ, పశుమేత ప్లాంట్ ను శ్రీజా డెయిరీ సంస్థ ఏర్పాటు చేయనుందని.. తద్వారా స్థానిక మహిళలకు, పాడి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. డెయిరీ ప్రోటీన్ తయారీ కోసం ఏస్ ఇంటర్నేషనల్ రూ.525 కోట్ల పెట్టుబడిని పెట్టనుందని వెల్లడించారు. ఇక స్థానికంగా 2 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించేలా ఎస్వీఎఫ్ సోయా సంస్థ రూ.373 కోట్ల వ్యయంతో ప్లాంట్ ను ఏర్పాటు చేయనుంది. పండ్లు ఉత్పత్తి చేస్తున్న రైతులకు ప్రయోజనం కల్పించేందుకు మదర్ డైరీ సంస్థ రూ.260 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. జ్యూస్, జామ్, పల్ప్ యూనిట్ ను మదర్ డైరీ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఎలక్ట్రిక్ ఆటోలు, ద్విచక్ర వాహనాలు తయారీ సంస్థ ఇ-రాయస్ ఈవీ అడ్వాన్స్ ఎలక్ట్రిక్ వెహికిల్ ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేస్తోందని రూ.200 కోట్లతో ప్లాంట్ ప్రారంభం కానుందని తెలిపారు. గ్రీన్ మొబిలిటి కేంద్రంగా కుప్పం మారుతుందని అన్నారు. స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలకు ఉపకరించేలా రూ.27 కోట్ల తో పారిశ్రామిక పార్కును అలీప్ సంస్థ ఏర్పాటు చేయనుందన్నారు. 40 వేల చదరపు అడగుల విస్తీర్ణంలో నిర్మించే ఈ మహిళా శక్తి భవన్ లో 4 వేల మంది మహిళలకు ఉపాధి, శిక్షణ అవకాశాలు కలుగుతాయని అన్నారు.







**మంచి పబ్లిక్ పాలసీలు చరిత్రను తిరగరాస్తాయి**

కుప్పం నియోజకవర్గానికి చెందిన ప్రజలతో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "ప్రతి మహిళా, ప్రతి యువతా ఒక పారిశ్రామికవేత్త కావాలి. పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చారన్నది ముఖ్యం కాదు. ఉన్నత విద్య ద్వారానే ప్రయోజకత్వం వస్తుంది. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వన్ ఫ్యామిలి - వన్ ఎంటర్ ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ నిపుణులు అనే పాలసీలు చరిత్రను తిరగరాస్తాయి. ప్రతి పరిశ్రమా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలి. 100 శాతం సౌర విద్యుత్ వినియోగించుకునే నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తున్నాం. తమిళనాడు, కర్ణాటకలకు అనుసంధానంగా ఉన్న కుప్పానికి అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి. కుప్పం నుంచి వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసేలా రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఎయిర్ కనెక్టివిటీ పెంచుతాం. అలాగే బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, లాజిస్టిక్స్, ఫుట్ వేర్, ఇన్నోవేషన్ హబ్ గా కుప్పం రూపు దిద్దుకోనుంది. పబ్లిక్ పాలసీలతో చరిత్రను తిరగరాయవచ్చు. వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూయర్, వన్ ఫ్యామ్లీ-వన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలు విస్తృత అవకాశాలు కల్పిస్తాయి. స్థానిక ఉత్పత్తులను స్థానికంగా ఉన్న వనరులను వినియోగించుకునే అవకాశాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాను." అని సీఎం అన్నారు.

**సంక్షేమానికి అధిక ప్రాధాన్యత**

"కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ ను అమలు చేశాం. ప్రజల జీవన ప్రమాణాలను పెంచాం. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి. హంద్రీ నీవా ద్వారా నీటిని కుప్పం వరకు తీసుకువచ్చి అందరి కలను నిజం చేసి చూపించాం. భవిష్యత్ లో కుప్పానికి తాగు, సాగు నీటి సమస్య ఉండదు. మనం తీసుకునే ఆహారం, ఆలోచన విధానంపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే టాటా సంజీవని ద్వారా 57,545 ఆరోగ్య సేవలు అందించాం. కుప్పం పరిధిలో 400 ఇ-సైకిళ్ల ను స్వయం సహాయ సంఘాలకు చెందిన సభ్యులకు ఇచ్చాం. స్వర్ణ కుప్పం సాధనలో భాగంగా చెత్త సేకరణకు 130కి పైగా ఎలక్ట్రిక్ సీఎన్జీ ఆటోలు వినియోగంలోకి తెచ్చాం.కుప్పం సెంట్రల్ పార్క్, వచ్చే ఏడాదిలో డీకే పల్లి పార్క్, మోడల్ బస్ స్టేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్ కాంప్లెక్స్ సిద్ధం అవుతాయి. వచ్చే ఏడాది మార్చి కల్లా రాష్ట్రంలోనే తొలి జీరో-ల్యాండ్‌ఫిల్ నియోజకవర్గంగా కుప్పం నిలుస్తుంది. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ నిషేధించాం. నెట్-జీరోనే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని" సీఎం చంద్రబాబు తెలిపారు.

**స్థానికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి**

అంతకుముందు కుప్పం స్థానిక రైతులు, ప్రజలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ గా మాట్లాడారు. పరిశ్రమలు స్థాపించడం ద్వారా తమకు ఉపాధి కల్పించినందుకు ముఖ్యమంత్రికి కుప్పం వాసులు ధన్యవాదాలు తెలిపారు. కుప్పానికి ఈ స్థాయిలో పరిశ్రమలు వస్తాయని కలలో కూడా అనుకోలేదని, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల రాకతో తమ ఉత్పత్తులను స్థానికంగా విక్రయించే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రికి రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు. తెలుగుదేశం పార్టీ నేతలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# ఏఐ.. వరమా?శాపమా

ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఎఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారట! ఒక్క ఏఐ అనే కాదు ఏ సాంకేతికత అయినాసరే దాన్ని'మానవాళికి వరం' అంటూ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు! అయితే, ప్రతివ్యక్తికీ మోసగించే ప్రవృత్తి కూడా ఒకటి ఉంటుందని మరోపక్క శాస్త్రాలు హెచ్చరిస్తున్నాయి! ఇలాంటి పరిస్థితుల్లో, మనం ఏఐని సంపూర్ణంగా విశ్వసించగలమా?భగవద్గీత ప్రకారం, ప్రతీ ఆవిష్కరణ భగవంతుడు ప్రేరేపించిన బుద్ధితో ప్రకృతిలో సూక్ష్మ నియమాలను కనుగొనడం ద్వారా లభిస్తుంది. ప్రతి సాంకేతిక ఆవిష్కరణ ఒక కత్తితో పోల్చదగినది. ఒక వైద్యుడు కత్తిని ఉపయోగించి ఆపరేషన్ చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడగలడు. ఒక దుర్మార్గుడు అదే కత్తిని మరోవ్యక్తి ప్రాణాలను తీసేందుకూ ఉపయోగించగలడు. కాబట్టి, ఇక్కడ ప్రశ్న కత్తి మంచిదా, చెడ్డదా అని కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే అసలు విషయం. అదే విధంగా, ఏఐ సాంకేతికత స్వతహాగా మంచిదికానీ చెడ్డదికానీ కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే ముఖ్యం. ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించేందుకా, లేదా ధనికులుగా మారేందుకా! భగవత్ సంబంధితమైన సాంస్కృతిక విలువలను ప్రోత్సహించి సమాజంలో మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించేందుకా?కృత్రిమ మేధస్సు (ఎఐ), అణుశక్తి, ఇతర శక్తిమంతమైన సాంకేతికత ఏదైనా సరే, దానిని కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే కలిగే దుష్పరిణామాలను గురించి హరేకృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు తమ భగవద్గీత భాష్యంలో స్పష్టంగా హెచ్చరించారు. భౌతిక ప్రపంచంలో సాధ్యమైనంత వరకు సుఖం అనుభవించాలని ప్రయత్నిస్తూ, ఇంద్రియ సుఖాల కోసం ఏదో ఒక కొత్త దాన్ని కనిపెట్టడంలోనే వాళ్లు ఎల్లప్పుడూ నిమగ్నులై ఉంటారు. అలాంటి భౌతిక పరిశోధన ఫలితాలు మానవ నాగరికత పురోభివృద్ధిగా పరిగణించినప్పటికీ, ప్రజలు రోజురోజుకూ హింసాప్రాయులుగా, క్రూరులుగా తయారవుతున్నారు. జంతువుల పట్ల, సాటి మనుషుల పట్ల హింసా ప్రవృత్తిని పెంచుకుంటున్నారు. తోటి జీవులతో ఎలా మెలగాలో వారికి తెలియడం లేదు. తమ పరిశోధనల ద్వారా అందరికీ వినాశనాన్ని చేకూర్చే వస్తువులను కనిపెట్టే వాళ్లు ప్రపంచానికి శత్రువులుగా పరిగణన పొందుతారు.మనిషి పుటింది మొదలు గిట్టే వరకు సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తూనే ఉంటుంది. మనిషి తన మేధస్సుకు, మనుగడకు ఎదురయ్యే ప్రతి సమస్యలను, సవాళ్ళను అధిగమించి ఎప్పటికప్పుడు వాటిని అవకాశాలుగా మార్చుకుంటూనే వస్తున్నాడు. తాజాగా కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవునికి సవాల్‌గా మారుతుందా అన్నది ఆలోచించాల్సిన అంశం.తన శారీరక శ్రమను తగ్గించుకోవడానికి అనేక రంగాల్లో పరిశోధనలు చేసి వాటికి పరిష్కార మార్గాలు కనుగొన్నాడు. ఇప్పుడు ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ కూడా మానవ సృష్టే అన్న విషయం మరువొద్దు. తన సౌలభ్యం కోసం సృష్టించిన ఏఐ ఇవాళ సొంతంగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకోవడమే కాదు అత్యంత వేగంగా, దోషరహితంగా పనిచేస్తుంది. మరి ఏఐ వరమా? శాపమా అన్న విషయాన్ని గమనిస్తే.. ఏఐ వచ్చి న తర్వాత సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగుల లేఆఫ్స్ పెరిగిపోతున్న వార్తలు తరచూ చూస్తూనే ఉన్నాం. నిజానికి ఏఐ రావడం వల్లనే ఉద్యోగాలు ఊడిపోతున్నాయనేది కేవలం అపోహ మా త్రమే.ఎందుకంటే ఏఐను సృష్టించింది మానవుడే. దానిని నియంత్రించే శక్తి కానీ, మెరుగుపరిచే సాంకేతికత కానీ మానవుడికే ఉంటుంది తప్ప ఏఐ తనంతట తానుగా అప్‌గ్రేడ్ చేసుకోలేదు. ఏఐ అప్‌గ్రేడ్ కోసం మళ్లీ మానవుడి తెలివితేటలే అవసరం అన్న విషయాన్ని గ్రహించండి. ఏఐ ఎప్పుడూ మనిషికి సేవకుడే కానీ పోటీదారుడు ఎంతమాత్రం కాదు. ఏఐను దాటడానికి పరిష్కార మార్గాలు కూడా మన చేతుల్లోనే ఉన్నాయి.నైపుణ్యాలు పెంచుకోవడం, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులతో ఏఐపై పట్టు పెంచుకోవడం చేయాలి. ఏఐ మనిషిలా ఆలోచిస్తుంది, కానీ మనిషిని మంచి సృజనాత్మకతను చేయలేదు. కళ, సాహిత్యం, సంగీతం, డిజైన్ రంగాలు ఎప్పటికీ సురక్షితమే. మానవుని భా వాలు, ఊహాలు ఏఐకి ఎప్పటికీ రావు. మారుతున్న సాంకేతిక యుగంలో ఏఐ తదనంతరం కూడా కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తూనే ఉంటుంది. వాటిని సృష్టించేది కూడా మానవుడే అనేది సత్యం. ఏఐ నిర్వహణ, ఏఐ ఎథిక్స్, ఏఐ భద్రత, గ్రీన్ టెక్నాలజీ, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ రంగాలు భవిష్యత్తులో మరింత విస్తరించనున్నాయి.నిరుద్యోగాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి. ప్రతీ మార్పు కొత్త అవకాశం కోసమే అన్నది గుర్తుంచుకోవాలి. కొన్ని దశాబ్దాల కిందట అనేక నూతన యంత్రాలు, కంప్యూటర్ పరికరాలు వచ్చినప్పుడు కూడా కార్మికులు, ఉద్యోగులు ఇదే విధంగా భయపడ్డారు. కానీ ఎన్ని యంత్రాలు, పరికరాలు తయారైనా వాటిని ఆపరేట్ చేయాల్సింది మనుషులే. ఎందుకంటే వాటంతట అవి ఆపరేట్ చేసుకోగలిగే శక్తి ఉన్నా ఎంత మోతాదులో కావాలన్నది నిర్ణయించాల్సింది మనమే అన్న విషయం తెలుసుకోవాలి. మానవుని కోరికలు, అభిరుచులు అనంతం.వాటిని తీర్చుకోవడానికి మానవుడు ఎప్పటికప్పుడూ తన సృజనాత్మకతకు పదును పెడుతూనే ఉన్నాడు. ఇప్పు డు వచ్చిన ఏఐ విషయంలోనూ అదే జరుగుతుంది. ఏఐ పట్ల భయం, నిరుత్సాహం, నిస్తేజం అనవసరం. మానవుని ఆలోచనలు, అభిరుచులకు తగ్గట్లుగా మారే ఆలోచనా విధానం ఏఐలో లేవు. ఏఐ మానవ చరిత్రను మారుస్తుంది. కానీ మానవుడు దాని సృష్టికర్త అని మరువద్దు. ఏఐని ఉపయోగించి సమాజాన్ని మెరుగుపరచాలి. అలాగే ఏఐ యుగం ఎప్పటికీ మానవుని విజయమే.

# మంత్రుల వ్యవహారశైలిపై సీఎం అసంతృప్తి



**గుంటూరు, సూర్య వాస్తవం, నవంబర్ 8:** ఏపీ క్యాబినెట్ మీటింగ్ జరిగే సమయాల్లో మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వారి శాఖపై ఏమాత్రం పట్టు సాధించలేని పరిస్థితి నెలకొందని.. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోను?ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను గట్టిగా తిప్పికొట్టడంలోను మంత్రుల ఇన్వాల్‌మెంట్ సరిగా ఉండడంలేదనే భావనలో సీఎం ఉన్నారనే గుసగసలు వినిపిస్తున్నాయి. అటు పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా మంత్రులు పాల్గొనలేకపోతున్నారనే చర్చ పార్టీ నేతల్లో ఉందట. సగం మంది మంత్రులు హైదరాబాద్, వైజాగ్, బెంగళూరులకు షటిల్ సర్వీస్ చేస్తున్నారనే విమర్శలున్నాయట. క్యాబినెట్ భేటీలో మంత్రుల తీరుపై చర్చ:. గత ఆరు నెలల కాలంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్రంలో అక్కడక్కడా పర్యటనలు చేస్తూ.. ప్రభుత్వం పై సంబంధింత శాఖల మంత్రుల పై ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ శాఖలకు సంబంధించిన మంత్రులు గాని.. మిగిలిన వారు కానీ వైసీపీ నేతల నుంచి, జగన్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వడంలో విఫమలవుతున్నారనే చర్చ టీడీపీలో నడుస్తోందట. ఈ విషయమై ప్రతి క్యాబినెట్ భేటీలోను మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.. ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు:. వైసీపీ అధ్యక్షుడు జగన్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని, వాస్తవాలు ప్రజలకు చెప్పటంలో మంత్రులు వైఫల్యం చెందుతున్నారని చంద్రబాబు అసంతృ వ్యక్తం చేస్తూనే ఉన్నారట. చంద్రబాబు ఎన్నిసార్లు అసంతృప్తి వ్యక్తం చేసినా నేతల తీరులో మాత్రం మార్పు రావడం లేదట. తాజాగా మంత్రుల పై లోకేష్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం పార్టీ నుంచి కానీ, మంత్రుల నుంచి కానీ గట్టి కౌంటర్ ఎందుకు ఇవ్వలేకపోయారని అడిగినట్లు టాక్ వినిపిస్తోంది. గ్రీవెన్స్‌సెల్‌ను పట్టించుకోవడం లేదని లోకేష్ ఆగ్రహం:. ప్రతిపక్షంగా వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రులు లైట్ తీసుకుంటున్నారనే ఫీలింగ్‌లో ఉన్న నాయకత్వానికి.. టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రీవెన్స్ సెల్‌ను కూడా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదనే చర్చ నడుస్తోందట. ప్రజాదర్బార్ విషయంలో నారా లోకేష్ కూడా సీరియస్ అయినట్లు చెప్తున్నారు. ప్రజా దర్బార్‌ను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన యువనేత, అసలు చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం లేదని మండిపడ్డారట. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన లోకేష్, ఆ ప్రజా దర్బార్ కు వేల సంఖ్యలో ప్రజలు రావడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారట సుమారు ఐదు గంటల పాటు సమస్యలు విని అసలు ఎందుకు ఈ ఇంతమంది సమస్యలతో పార్టీ కార్యాలయానికి వచ్చారంటే నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారట. ఇకపై నియోజకవర్గాల్లో, మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించాల్సిందనేని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌కు మంత్రులు తప్పకుండా హాజరు కావాలిని ఆదేశాలు జారీ చేశారట. ఆ క్రమంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయిలో మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోడంలేదా అనే చర్చ మొదలైందట. మరోవైపు వైసీపీ చేస్తున్న విమర్శల్ని దీటుగా ఎదుర్కొన లేకపోవడం మంత్రుల వైఫల్యంగా మారిందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. 2014 -19 మధ్య కూడా వైసిపి చేసిన ప్రచారాన్ని ధీటుగా సమాధానం చెప్పకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో ఓటమి కారణంగా పార్టీ అధిష్టానం భావిస్తుందనే చర్చ కూడా పార్టీ నేతల్లో ఉందట:. గతంలో జరిగిన తప్పిదాన్ని మరోసారి జరక్కుండా చూసుకోవాలని అధిష్టానం భావిస్తుందట. విశాఖపట్నం సమ్మిట్ అయిపోయిన తర్వాత జిల్లాల వారీగా మంత్రులు ఎమ్మెల్యేలతో లోకేష్ సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారట. ప్రతిపక్ష పార్టీ చేసే ప్రతి విమర్శకి సంబంధిత జిల్లా నుంచి అయితే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు.. రాష్ట్రస్థాయిలో అయితే ఆ శాఖ మంత్రి, ప్రభుత్వ అధికారులతో వెంటనే రిప్లై ఇప్పించాలని యోచిస్తున్నారట. పార్టీ, ప్రభుత్వం రెండు కలిసి పనిచేసే విధంగా అధిష్టానం కసరత్తు చేస్తుందట. త్వరలోనే ఫాక్ట్ చెక్ పేరుతో టీడీపీ కమిటీ వేయాలని చెప్పి నిర్ణయం తీసుకున్నట్లు నేతలు చెబుతున్నారట. ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు.. దానికి కౌంటర్ గా ఏ రకంగా ముందుకు వెళ్లాలి అనేదానిపై కమిటీ వేసే ఆలోచనలో టీడీపీ ఉందట. టీడీపీ అధిష్టానం కార్యచరణ ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# పొలిటికల్ టర్న్ తీసుకున్న డ్రగ్స్ కేసు



**విశాఖపట్టణం, సూర్య వాస్తవం, నవంబర్ 8:** విశాఖలో చోటుచేసుకున్న డ్రగ్స్ కేసు ఇప్పుడు రాజకీయ మలుపు తిరుగుతోంది. ఈ కేసులో వైసీపీ స్టూడెంట్ వింగ్ నాయకుడు కొండారెడ్డి అరెస్టు వివాదాస్పదంగా మారింది. పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని చెబుతుండగా, వైసీపీ మాత్రం దీనిని ప్రభుత్వ కుట్రగా పేర్కొంటోంది. పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీసు వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఆరోపణల ప్రకారం.. కొండారెడ్డిని ఉదయం 7 గంటల సమయంలోనే పోలీసులు అరెస్టు చేశారని, అయితే కేసు నమోదు మాత్రం సాయంత్రం 4.30కి చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై వైసీపీ అనుమానం వ్యక్తం చేస్తోంది. పార్టీ నాయకులు పలు వీడియోలు, టైమ్ స్టాంపులు ఆధారంగా చూపిస్తూ.. అరెస్టు సాయంత్రం జరిగిందని పోలీసులు చెబుతుంటే, ఉదయం 11.30 గంటలకు టీడీపీ అధికారిక సోషల్ మీడియా పేజీలో అరెస్ట్ ఫోటోలు ఎలా వచ్చాయి? అని ప్రశ్నించారు. కొండారెడ్డి అరెస్టు అనంతరం ఆయనను సమీపంలోని టాస్క్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ (మూడే కిలోమీటర్ల దూరంలో)కి తీసుకెళ్లకుండా.. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో స్థలానికి తీసుకెళ్లారని వైసీపీ ఆరోపిస్తోంది. ఆ టైమ్‌లో కొండారెడ్డి ఎక్కడ ఉన్నారు? ఎవరిని కలిశారు? ఎవరైనా ఒత్తిడి చేశారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. అరెస్టు అనంతరం కొండారెడ్డి మీడియా ముందు కన్నీళ్లతో మాట్లాడుతూ.. నా కొడుకును నిర్దోషిగా లాక్కెళ్లి, ప్రైవేట్ పార్ట్స్‌పై కొట్టి బలవంతంగా నేరాన్ని ఒప్పించారని ఆరోపించారు. డ్రగ్స్ కేసుతో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని, అవసరమైతే ఏ టెస్టుకైనా సిద్ధంగా ఉన్నామని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ఈ ఘటనను రాజకీయంగా ప్రేరేపిత అరెస్టుగా పేర్కొంటూ.. హోమ్ మినిస్టర్ కేవలం జగన్‌ని విమర్శించడానికే ఉన్నారు. ప్రజల భద్రత గురించి పట్టించుకోవడం లేదు అని వైసీపీ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.. ఇక వైసీపీ మహిళా నాయకులు కూడా హోమ్ మినిస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఎన్సీఆర్బి రిపోర్టు ప్రకారం, అమ్మాయిల మిస్సింగ్ కేసులు రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఆమె ఏ హోమ్ కి మినిస్టర్ అంటూ వైసీపీ విమర్శలు గుప్పించారు. కొండారెడ్డి అరెస్టు వ్యవహారంలో వైసీపీ వీడియోలు బయట పెట్టడంతో డైలమాలో కూటమి ప్రభుత్వం పడిందని విమర్శించారు.

# వైసీపీ గూటికే విజయిసాయి?

**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 8:** విజయసాయిరెడ్డి యూటర్న్ తీసుకున్నారా? జగన్మోహన్ రెడ్డికి దగ్గర అవుతున్నారా? లిక్కర్ స్కామ్ కేసులో సాక్షులుగా ఉన్న ఆయన అల్లుడు పిటిషన్ వేయడం ఏంటి? వాంగ్మూలం వెనక్కి తీసుకోవాలని కోరడం ఏంటి? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. విజయ సాయిరెడ్డి వ్యవహారంలో రెండు పరిణామాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. విశాఖ బీచ్ ను విధ్వంసం చేశారని ఆయన కుమార్తె కంపెనీ పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జీవీఎంసీ కి నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో లిక్కర్ స్కాం కేసులో సాక్షులుగా ఉన్న రోహిత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఇచ్చిన వాంగ్మూలాలను వెనక్కి తీసుకోవాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కొన్ని నెలల కిందట విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆయన వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. కానీ అనూహ్యంగా లిక్కర్ స్కాం కేసులు అనధికారిక అప్రూవర్‌గా మారారు. ఆయన ఇచ్చిన సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసుల నమోదు, అరెస్టులు జరిగాయని అంతా భావించారు. కానీ ఇటీ వల విజయసాయిరెడ్డి ఫుల్ సైలెంట్ అయ్యారు. కనీసం ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదు. గతంలో విజయసాయి రెడ్డి అల్లుడు రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు శరత్ చంద్రారెడ్డి లిక్కర్ స్కామ్ దర్యాప్తు చేస్తున్న సిట్ కు వాంగ్మూలం ఇచ్చారు. తమ కంపెనీల ద్వారా లిక్కర్ స్కాం నగదును చలామణి చేశారని.. అందులో రూపాయి కూడా తాము సంపాదించలేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ వాంగ్మూలాన్ని వెనక్కి ఇప్పించాలని కోర్టులో వారు పిటిషన్ దాఖలు చేయడం మాత్రం సంచలనంగా మారింది. దీనివెనుక విజయ సాయిరెడ్డి ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.కచ్చితంగా కేసులకు భయపడి విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారని సాక్షాత్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. వైసీపీ శ్రేణులు సైతం ఇదే విషయాన్ని చెప్పుకుంటూ వస్తున్నాయి. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి అసలు సూత్రధారుడు అన్న విజయసాయిరెడ్డి.. అవసరమైతే ప్రత్యేక దర్యాప్తు బృందానికి అన్నివివరాలు సమర్పిస్తానని చెప్పుకొచ్చారు. మొత్తం విజయసాయిరెడ్డి ఇచ్చిన వివరాలతోనే ఇప్పటి వరకు అరెస్టులు జరుగుతున్నాయని అంతా భావించారు. అయితే ఇప్పుడు ఆయన అల్లుళ్లు ఇద్దరు పిటిషన్లు దాఖలు చేయడంతో.. విజయసాయిరెడ్డి అడ్డం తిరిగారు అన్న టాక్ వినిపిస్తోందిబీ విజయ సాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరతారని ప్రచారం సాగింది. ఆయనకు ఇప్పుడు ఆప్షన్ లేదు. జగన్మోహన్



రెడ్డికి గత్యంతరం లేదు. జగన్ పక్కన విజయసాయిరెడ్డి ఉండడంతో చాలా రకాల పనులు ఇట్టే జరిగిపోయేవి. ఢిల్లీ స్థాయిలో చాలా పనులను చక్కదిద్దే వారు విజయసాయిరెడ్డి. కానీ జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పేరు మోసిన బిగ్ హాండ్స్ కలిసి రావడంలేదు. ఇటువంటి తరుణంలో విజయసాయి ఒడ్డితో రాజీ చేసుకుంటే మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏ కేసులకు భయపడి వైసీపీ నుంచి బయటకు వచ్చారో.. అది నెరవేరడం లేదు. అందుకే విజయసాయిరెడ్డి నిర్ణయా నికి వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## భక్త కనకదాసు చూపిన బాటలో నడుద్దాం

• కురబ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 8:** భక్త కనకదాసు చూపిన బాటలో నడుద్దామని కురబ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ మరియు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నాగేంద్ర రాజు పేర్కొన్నారు. శనివారం భక్త కనకదాసు జయంతి సందర్భంగా రాయచోటి కలెక్టరేట్లో... కురబ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నాగేంద్ర రాజు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు భక్త కనకదాస చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురబ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ మాట్లాడుతూ.... భక్త కనకదాసు తన రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి దోహదం చేశారన్నారు. ఆయన చూపిన బాటలో మనమందరం నడవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ.... కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్త కనకదాసు సామాన్యులకు అర్థమయ్యే విధంగా కన్నడ భాషలో రచనలు, కీర్తనలు రాసి కృష్ణుడి భక్తుడయ్యారన్నారు. ఆయన తన రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి దోహదం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నాగేంద్ర రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి బీసీ వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డి, కురుబ సంఘ నాయకులు రఘునాథ్ గారు, జబ్బల శ్రీనివాస్ గారు, ఈశ్వరయ్య గారు, అడ్వకేట్ రవి శంకర్ , రమణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి కృతజ్ఞతలు

**ఆర్టీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ హామీ ఇవ్వడంపై హర్షం - భక్త కనకదాసు జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**





**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, నవంబర్ 8:** ఆర్డీటీ సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ కోసం కృషి చేసిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కళ్యాణదుర్గంలో జరిగిన భక్త కనకదాసు జయంతి ఉత్సవంలో ఆయన మంత్రి నారా లోకేష్‌తో పాటు సహచర ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, టిడిపి నాయకులతో కలసి పాల్గొన్నారు. భక్త కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. గొప్ప తత్వవేత్త, సంఘసంస్కర్త అయిన కనకదాసు జయంతి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేలా మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకున్నారన్నారు. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం బీసీల పక్షాన ఉంటుందన్నారు. కురుబలు ఆర్థికంగా సామాజికంగా ప్రాధాన్యత కల్పించారన్నారు. ముఖ్యంగా నారా లోకేష్ పాదయాత్రలో భక్త కనకదాసు జయంతి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగ నిర్వహిస్తామని ఆరోజే హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం భక్త కనకదాసు రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గుడికట్ల పూజారులకు గౌరవవేతనం ఇస్తామని చెప్పడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి హర్షం వ్యక్తం చేశారు. అలాగే వారికి మరిన్ని హామీలు ఇచ్చారన్నారు. ఆర్డిటి సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ తీవ్రమైన సమస్యగా మారిన సమయంలో మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకున్నారన్నారు. ఇప్పుడు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ తో పాటు ఆ సంస్థకు మరింత ప్రోత్సాహం ఇస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం సేవ చేసేవారికి, పేదల పక్షాన నిలబడుతుందని చెప్పడానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.



## సమసమాజ స్థాపనకు కనకదాసు సేవలు ఆదర్శనీయం

• అదనపు ఎస్పీ యం.వెంకటాద్రి

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 8:** సామాజిక సంస్కర్త, గొప్ప కవి భక్త కనకదాసు జయంతి వేడుకలను అన్నమయ్య జిల్లా పోలీసులు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు ఎస్పీ యం.వెంకటాద్రి గారు కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి, ప్రత్యేక నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ..కనకదాసు తన కీర్తనల ద్వారా సమాజంలో పాతుకుపోయిన కుల వ్యవస్థను, అసమానతలను నిర్భయంగా ప్రశ్నించారని, మానవత్వపు విలువలే అత్యున్నతమని చాటిచెప్పారని అదనపు ఎస్పీ తెలిపారు. కనకదాసు స్ఫూర్తిని కొనసాగిస్తూ, "మన పోలీస్ శాఖ కూడా సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా, అట్టడుగు వర్గాలకు కూడా సత్వర న్యాయం అందించే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలి" అని సిబ్బందికి పిలుపునిచ్చారు. పోలీసు సిబ్బంది తమ వృత్తి విధులను నిర్వహించడంలో కనకదాసు గొప్ప ఆదర్శాలను తప్పక ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) వి.జె.రామకృష్ణ, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది పెద్దసంఖ్యలోపాల్గొని, కనకదాసు సేవలను స్మరించుకున్నారు.



# మహనీయుడు భక్త కనకదాసు: జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



**శ్రీ సత్యసాయి బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 8:** జిల్లా వెనుకబడిన సంక్షేమ తరగతుల శాఖ ఆధ్వర్యంలో... భక్త కనకదాసు జయంతిని శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమంలో భక్త కనకదాసు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, భక్తిశ్రద్ధలతో కలెక్టరు, జేసి, డిఆర్ఓ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, బీసీ సంఘాల నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ భక్త కనకదాసు జీవితం, ఆయన బోధనలు, సామాజిక స్ఫూర్తిపై పలువురు ప్రసంగించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ... తన కీర్తనలతో సమాజాన్ని జాగృతం చేసి, ఉత్తమ సమాజ నిర్మాణం కోసం పాటుపడ్డ దాస శ్రేష్ఠ ఆరాధ్యదైవం శ్రీ భక్త కనకదాస గారి జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. శ్రీ భక్త కనకదాసు గారు కేవలం భక్తుడు మాత్రమే కాకుండా సమాజంలో సమానత్వం, సత్సంగత, సేవ అనే విలువలను ఆచరణలో చూపిన మహనీయుడు. ఆయన జీవితం మన అందరికీ మార్గదర్శకం కావాలి. "వర్ణభేదాలేని సమాజం, పరస్పర గౌరవం, భక్తి మార్గం అనే సూత్రాలను ఆయన పాటించారు. నేటి తరానికి ఆయన ఆలోచనలు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి" అని అన్నారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ...శ్రీ భక్త కనకదాసు గారి సంగీతం, సాహిత్యం లోని ఆధ్యాత్మికత మనసును మేల్కొలుపుతుంది. ఆయన జీవితం ధైర్యం, భక్తి, సేవకు చిహ్నం. ఈ తరహా మహనీయుల జయంతులు మన సమాజంలో సద్విలువలను ప్రోత్సహించే అవకాశాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, మహేష్ జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర, ఆర్టీవో కరుణ సాగర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి మోహన్ రామ్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పబ్లిక్ హెల్త్ అధికారి నరసింహ, వెనుకబడిన తరగతుల వివిధ సంఘాల నాయకులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ సంగీత శిక్షణాలయం ప్రారంభం

## రంగస్థలం, సంగీత కళాకారులకు ఘన సన్మానం












**రాయచోటి, సూర్య వాస్తవం, నవంబర్ 8:** సంగీతం పట్ల ఆసక్తి గలవారికి, ఔత్సాహిక సంగీత కళాకారులు కోసం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో శ్రీకృష్ణ సంగీత శిక్షణాలయాన్ని ప్రముఖ హార్మోనిస్టు, తబలిస్ట్, మాస్టర్ సురేష్ బాబు స్థాపించడం సంతోషకరమైన విషయమని ప్రముఖ చిత్రకారుడు, నటుడు, రచయిత, దర్శకుడు ఎస్.అభినయ్, ప్రముఖ హార్మోనిస్టు పార్థసారధి స్వామి, రంగస్థలం కళాకారులు రామకృష్ణ, భాస్కర్ రెడ్డిలు, సుబ్రహ్మణ్యం రాజులు అన్నారు. శనివారం పట్టణంలోని రాజధాని హెూటల్ ఎదురుగా శ్రీకృష్ణ సంగీత శిక్షణా లయం ప్రారంభోత్సవం సందర్భంగా కళా రంగంలో వారు చేసిన విశిష్ట సేవలను గుర్తించి వారికి శాలువాలు కప్పి పూలమాలువేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అభినయ్ మాట్లాడుతూ సంగీత కళల పట్ల ఆసక్తి ,అభిరుచి గల ఔత్సాహిక కళాకారులకు శిక్షణ పొందేందుకు ఇది మంచి అవకాశం అన్నారు. అన్నమయ్య జిల్లాలోనే కాదు రాష్ట్రంలో ఎంతోమంది నిరుపేద కళాకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం హార్మోనియం, కీబోర్డ్ (ఎలక్ట్రికల్ ఇన్స్ట్రుమెంట్) తబలా, డోలక్, డప్పు, ప్యాడ్ (ఎలక్ట్రికల్ రిథమ్) వయోలిన్, మృదంగం, ఫ్లూట్‌వంటి సంగీత పరికరాలకు కొరకు ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గంగాధర నాయుడు, సురేంద్ర, నాగభూషణం, హరిదాసు ఉషారాణి శ్రీధర్, లక్ష్మిరెడ్డి, మల్లి నాయుడు, సివి రమణ, రాజశేఖర్, నాగయ్య, నరసింహ శర్మ, సురేష్, ఓబుల్ రెడ్డి, రమణ, గంగరాజు, హరి, పురుషోత్తం, గురప్ప, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



**మదనపల్లె, సూర్య వాస్తవం, నవంబర్ 8:** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందడం కలకలం రేపుతోంది. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో వెలుగుచూసింది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. మాలేపాడు పంచాయతీ, నడుమూరికి చెందిన గాలేటి సుధాకర్, సుగుణ (34) దంపతులు మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో మగ్గాలు నేసు కుంటూ జీవనం చేసేవారు. రాత్రి స్వగ్రామంలో జరిగిన కోలాటకు ఇద్దరు వెళ్లారు. ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో సుగుణ శవమై కనిపించింది. కుటుంబ సభ్యులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పర్యటనకు

# పటిష్ట భద్రత ఏర్పాట్లు ఉండాలి

## జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్



**శ్రీ సత్య సాయి బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 8:** భగవాన్ శ్రీ సత్య సాయిబాబా గారి శత జయంతి ఉత్సవాల కోసం పుట్టపర్తికి విచ్చేసే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు కట్టుదిట్టంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, శ్రీ సత్య సాయి ట్రస్ట్ సభ్యులు రత్నాకర్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ అంకిత సూరణ మహావీర్, వివిధ శాఖల అధికారులతో కలిసి పుట్టపర్తిలో ప్రధాన మంత్రి పర్యటించే ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సమీక్షించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో, శ్రీ సత్య సాయి విమానాశ్రయం, లాంజ్‌లు, హిల్ వ్యూ స్టేడియం, సాయి కుల్వంత్ హాలు మొదలైన ప్రదేశాల్లో చేయాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా ఎన్.టి. చౌదరి లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ స్థలం పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. విమానాశ్రయం నుంచి ఆశ్రమంవరకు ప్రధానమంత్రి పర్యటన మార్గం, భగవాన్ శ్రీ సత్య సాయి మహా సమాధి దర్శనం, స్టేడియంలో జరిగే కార్యక్రమాలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వీఐపీలు, వాహనాల పార్కింగ్, ట్రస్ట్‌కు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు, ప్రజా నియంత్రణ తదితర అంశాలపై కూడా అధికారులతో సమన్వయంగా చర్చించారు. అన్ని శాఖలు సమష్టిగా సమన్వయంతో ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, ఆనందకుమార్, ఆర్టీవో కరుణసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పబ్లిక్ హెల్త్ డిఈ నరసింహ, తహసీల్దార్ కళ్యాణ్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్త కనక దాసు జయంతి



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 8:** అన్నమయ్య జిల్లా రాయచోటిలో కురుబ సంఘం నాయకులు భక్త కనకదాసు 538వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర కురుబ సంఘం నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు కనకదాసు చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడుతూ కర్ణాటక సంగీతం తాత్వికవేత్త పేదల పట్ల ప్రేమాభిమానాలు కలిగినటువంటి భక్త కనకదాసును వేనోళ్ళ కొనియాడారు. అనంతరం అన్నదాన వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు తరిగొండ ఈశ్వరయ్య మాట్లాడుతూ అంతటి మహానుభావుల జయంతిని నిర్వహించేటువంటి భాగ్యం కలిగినందుకు జీవితం ధన్యమని వారి యొక్క జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శప్రాయంగా ఆదర్శప్రాయంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కురువ సంఘం నాగేశ్వరరావు మాట్లాడుతూ తాత్వికవేత్త సామాజిక స్పృహ సంగీత కళాకారులు హరికథా పితామహులు అయినటువంటి శ్రీ భక్త కనకదాసు జీవితం ఆదర్శనీయమని వారి యొక్క జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు .అనంతరం అడ్వకేట్ రవిశంకర్ మాట్లాడుతూ ధార్మికవేత్త అయినటువంటి భక్త కనకదాసు జీవితాన్ని ఎల్లవేళలా ప్రతి ఒక్కరూ ఆదర్శప్రాయంగా నిలుపుకోవాలని వారి యొక్క జీవితాన్ని మన యొక్క జీవితంలో ఎల్లవేళలా గుర్తుంచుకొని మార్గదర్శకంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కురుబ నాయకులు సుధాకర్, అంకిశెట్టిపల్లి జబ్బల రెడ్డప్ప, మదనపల్లి మడికయుల శివాలయం చైర్మన్ కొప్పల వెంకటరమణ, మురళీ కుమార్, రెడ్డన్న, నాగేంద్ర, రమణయ్య, రవి, చంద్ర మోహన్ తదితరులు మరియు సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు.



### దృఢ సంకల్ప దీక్షకు మద్దతు తెలిపిన

# ఉద్యోగ సంఘాల నాయకులు

**అనంతపురం, సూర్య వాస్తవం, నవంబర్ 8:** వాల్మీకుల ఎస్. టి సాధన మరియు హక్కుల కోసం ఈ నెల 10వ తేదీన కర్నూలు లో జరిగే దృఢ సంకల్ప దీక్షలో పాల్గొవలసిందిగా ఆహ్వానిస్తూ వాల్మీకి ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర, అనంతపురం జిల్లా అధ్యక్షులు పుట్లూరు సుధాకర్ మరియు రమణ, నారాయణస్వామి తదితర వాల్మీకి ఉద్యోగస్తుల చేతుల మీదుగా దృఢ సంకల్ప దీక్షకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏపీ వాల్మీకి బోయ సంఘం ఉపాధ్యక్షుడు కేశవ,జిల్లా అధ్యక్షుడు మాధవయ్య,జిల్లా కార్యదర్శి చలపతి, నగర అధ్యక్షుడు కుళ్ళాయప్ప,ప్రధాన కార్యదర్శి ముత్యాలు,కూడేరు మండల యూత్ అధ్యక్షులు వీర మరియు వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.



### నాయుడుపేటలో

## నేడు విద్యుత్ అంతరాయం

### ఏఈ ఈఎన్ శివ శంకర్



**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 8:** నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ నాయుడుపేట పట్టణ ఏఈ ఈ ఎన్ శివ శంకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.నాయుడుపేట పట్టణంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ నుండి వెళ్లే 11 కెవి సప్తగిరి ఫీడర్ కండక్టర్ వైరు డ్యామేజ్ కారణంగా నూతన కండక్టర్ వైర్ మార్చుటకు, పట్టణంలోని సబ్ స్టేషన్ నుండి వెళ్లే అన్ని 11కేవీ ఫీడర్ల లో అత్యవసర మరమ్మత్తుల చేసేందుకు ఉదయం 09 :00 గంటల నుండి 2:00 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట, ఎల్ఐసాగరం, బీడీ కాలనీ,భూపయ్య కాలనీ,అగ్రహార పేట,పిచ్చిరెడ్డి తోపు,అమరా గార్డెన్,చంద్రమౌళి నగర్,పిచ్చిరెడ్డి తోపు,విజయ గణపతి టెంపుల్, టీచర్స్ కాలనీ, బాలాజీ గార్డెన్,గాంధీ మందిరం, జైహింద్,పొగ గొట్టం,గరిడి వీధి,కోళ్ల ఫారం ఆవని హోమ్స్,కాళహస్తి బైపాస్ రోడ్,హెచ్ పి పెట్రోల్ బంక్ ,రాజగోపాల పురం,శ్రీరామ్ నగర్,అశోక్ నగర్,విన్నమాల గేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. పట్టణ ప్రజలు,విద్యుత్ వినియోగదారులు తమ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**పామిడి, సూర్య వాస్తవం,నవంబర్ 8:** గుంతకల్ నియోజకవర్గంలో పామిడి పట్టణంలోని 3వ వార్డుకు చెందిన వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలో ఆవార్డు వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ సి.రజాక్ ఆధ్వర్యంలో శనివారం గుంతకల్ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, వైసిపి జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి,వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డిల ఆదేశాల మేరకు వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం కుటీలత్వపు వైఖరితో ప్రైవేటుకరణ చేయబోతున్నందున వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లుగా రజాక్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో,భవిష్యత్తుతో ఆడుకుంటుందని, కాలేజీలకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక మధ్యలోనే వదిలేస్తున్నారని, నిరుపేదల సొంత ఇల్లు కళలను నెరవేర్చడంలో ప్రభుత్వ విఫలమైందని ఆగ్రహం వ్యక్తపరిచారు. రాబోయే ఎన్నికలలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజాక్, నూర్ భాషా, లాల్ బాషా, నాగరాజు,మాబు, దాదాఖలంద్, ఆన్సర్, ఇబ్రహీం, అమీర్, షేక్షావలి, ఎల్లప్ప,భాష తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసిన

# పోట్లపూడి రాజేష్



**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 8:** రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని టిడిపి నేత,ఎస్ జె జువెలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నెల్లూరు నగరంలోని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసంలో ఆయనను టిడిపి నేత పోట్లపూడి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రికి శాలవాకప్పి ఘనంగా సన్మానించి,శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పోట్లపూడి రాజేష్ ను ఆప్యాయంగా పలకరించి,క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు.దీనితో రాజేష్ ఆనందం వ్యక్తం చేశారు.

## పత్తికొండ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



**పత్తికొండటౌన్, సూర్య వాస్తవం, నవంబర్ 8:** కర్నూలు జిల్లా స్థాయి స్కిల్ కాంపిటీషన్‌లో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ఐటీ/ఐటిఎస్ ట్రేడ్ వొకేషనల్ విభాగం అద్భుతమైన ప్రతిభ కనబరిచి మూడవ బహుమతిని సాధించింది. జిల్లాలో మొత్తం 300కు పైగా ప్రాజెక్టులు పోటీలో పాల్గొనగా, ఏపీఆర్ఎస్ పత్తికొండ విద్యార్థులు రూపొందించిన ఆటోమేటిక్ స్మోక్ డిటెక్టర్ అండ్ అన్లాక్ డోర్స్ ఓపెన్ ప్రాజెక్ట్ మూడవ స్థానాన్ని దక్కించుకుంది.ఈ ప్రాజెక్టను 10వ తరగతి విద్యార్థులు జాకీర్, మల్లికార్జున, అఖిల్ కుమార్ రెడ్డి రూపొందించగా, వీరికి వృత్తి విద్య ఉపాధ్యాయులు అమల,మనోహర్ సాంకేతిక మార్గదర్శకత్వం అందించారు.విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డా నాగేశ్వరరావు , రామాంజనేయులు నాయక్,అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డి ఈ ఓ) శామ్యూల్ పాల్, జీసీడీవో మేరీ స్నేహలత, వీ.సీ.లు ప్రతాప్ రెడ్డి, విక్రమ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్లు పాల్గొన్నారు. వారు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి, సృజనాత్మకతను అభినందించారు.ఈ సందర్భంగా డీఈఓ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ం "గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఆధునిక సాంకేతికతలో ముందంజలో ఉండటం గర్వకారణం. ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో కూడా విజయాలు సాధిస్తాయని ఆశిస్తున్నాం" అన్నారు.ఈ విజయంతో పత్తికొండ ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in





# ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

- రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్న పోలీసులు

**అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, నవంబర్ 8:** జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసినట్లు ఎస్పీ పి .జగదీష్ తెలిపారు..ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు శనివారం సాయంత్రం 5 గంటల నుండి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు తనిఖీలు ముమ్మరం చేశారు. మున్సిపల్ పట్టణాలు మండల కేంద్రాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. నేరాల నియంత్రణతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి గంజాయి, తదితరాలు ఏవి అక్రమ రవాణా జరుగకుండా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రోడ్డు భద్రతపై దృష్టి సారించారు. హెల్మెట్/ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని... మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి మించి ప్రయాణికులు తరలించడం చేయకూడదని సూచించారు. దీంతోపాటు రోడ్ సేఫ్టీ ఉల్లంఘనలపై ఫైన్‌లు వేశారు.



## పల్లిపాళెం ఉప్పుటేరు బ్రిడ్జ్ నిర్మాణానికి

# రూ.14 కోట్ల 60 లక్షలు కేటాయించండి

- మొంధా తుఫానుకు దెబ్బతిన్న కాలువల మరమ్మతులకు ఏఫ్డీఆర్ నిధులు మంజూరు చేయండి
- 2021లో నివార్ తుఫాను విధ్వంసం తాలూకు పెండింగ్ పనులను పూర్తి చేయండి
- బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీమంజిల్ నిర్మాణానికి నిధులివ్వండి
- జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌కు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వినతి

**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 8:** ఇందుకూరు పేట మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలను అనుసంధానించ డంలో కీలక పాత్ర పోషించే గంగపట్నం పల్లిపాళెం బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ ఎం డి ఫరూఖ్ కి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మెమొరాండం అందచేశారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు నెల్లూరు నగరానికి విచ్చేసిన మంత్రి ఎన్ ఎం డి ఫరూఖ్ ని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారితో కలిసి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పల్లిపాళెం ఉప్పుటేరు బ్రిడ్జ్ నిర్మాణానికి 14 కోట్ల 60 లక్షల రూపాయలు మంజూరు చేయవలసిందిగా ఆమె అంచనాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. 2021లో నివార్ తుఫాను కారణంగా కోవూరు నియోజకవర్గంలో విధ్వంసం అయిన పొర్లుకట్టలు, సాగునీటి కాలువలో విధ్వంసం తాలూకు పలు పనులు ఇంకా పెండింగ్ లో వున్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఇటీవల మొంధా తుఫాను కారణంగా దెబ్బతిన్న కాలువల మమత్తులకు ఏఫ్డిఆర్ నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీమంజిల్ నిర్మాణానికి పూర్తి చేసి కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 5 మండలాలలో ముస్లిం శ్మశాన వాటికలు, మసీదులలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.



# గుత్తి కోటను సందర్శించిన కె.ఎస్.కె ట్యూషన్ సెంటర్ విద్యార్థులు

**గుత్తి, సూర్య వాస్తవం, నవంబర్ 8:** గుత్తి పట్టణంలోని చారిత్రక ప్రాముఖ్యత గల గుత్తి కోటను కె.ఎస్.కె ట్యూషన్ సెంటర్ విద్యార్థులు సందర్శించారు. కె.ఎస్.కె ట్యూషన్ సెంటర్ అధినేత సునీల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముందుగా సంస్థ ప్రాంగణం నుం డి విద్యార్థులు గుత్తి ప్రధాన వీధుల గుండా ర్యాలీగా బయలుదేరి కోట చేరుకున్నారు.గుత్తి కోట ప్ర వేశద్వారం వద్ద గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయభాస్కర్ చౌదరి, కమిటీ సభ్యులు విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించారు.అనంతరం గాంధీచౌక్ నుండి కోట వరకు ర్యాలీ నిర్వహించి, గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా మన చారిత్రక సంపదను తెలుసుకో వాలి. గుత్తికోటవంటి చారిత్రక కట్టడాలను సందర్శించడం ద్వారా మనదేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వంపై అవగా హన విద్యార్థులకు పెరుగుతుంది అన్నారు.విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ, గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి అని పేర్కొన్నారు. కోట ప్రాసెస్ చాందిని వివరించిన పురావస్తు శాఖ సిబ్బంది పురావస్తు శాఖ సిబ్బంది వివరించిన ప్రకారం, గుత్తికోట 13వ శతాబ్దానికి చెందినది. అశోకుడు నుంచి ఆంగ్లేయుల దాకా



అనేక రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. కొండమీద విస్త రించి ఉన్న ఈ కోటలో రాజమహల్, రాణిమహల్, మసీదు, కోటలోని దేవాలయాలు, ఆయుధాగారం, నీటి కొలనులు, గోపురాలు, రహస్య మార్గాలు, బావులు వంటి అనేక నిర్మాణాలు ఉన్నాయి. కోట ప్రాసెస్ చాందిని వివరించిన పురావస్తు శాఖ సిబ్బంది రాతిశిల్పాలు, కోటలో త్రికోణాకార ప్రాకారాలు, శిల్పకళానైపుణ్యం, అప్పటి రాజులు రాజ్యాలను పరిపా లించిన శైలి, కోట ప్రజల జీవన విధానం వంటి విషయాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కోట చరిత్ర, నిర్మాణ పద్ధతుల గురించి తెలుసుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం గుత్తి కోట సంరక్షణ సమితి స భ్యులు సునీల్ కుమార్‌ను శాలు వాతో సత్కరించి,ఫిరంగి నమూ నా బహుకరించారు. విద్యార్థులకు నీటి ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు కరటికొండ సుధాకర్ నాయుడు,గౌరవ సలహాదారుడు బాబా సాహెబ్,సహాయ కార్యదర్శి శివకుమార్ చౌదరి,సోషల్ మీ డియా కన్వీనర్ శివ,యువజన సమితి కన్వీనర్ హెచ్.ఎం.జిలాన్, పురావస్తుశాఖ సిబ్బంది ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప ధ్వజ శిఖర ప్రతిష్ట



**గాండ్లపెంట, సూర్య వాస్తవం, నవంబర్ 8:** గాండ్లపెంట గ్రామంలోని చిన్నమిట్ట వద్ద ఉన్న శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానం లో మూడవ రోజు ఉదయాన్నే సుప్రభాత సేవతో మొదలయ్యి వేదపారాయణ గణపతి అయ్యప్ప విష్ణుమూర్తి రుద్రుడు నవ నాగ దేవతల మూల మంత్రాల హెూమం జరిగింది.అనంతరం అద్వజ శిఖర దాతలు మరియు ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీ నరసింహగౌడ్ స్వామి ,రఘునాథ రెడ్డి స్వామి,అందరూ ఊరేగింపుగా వచ్చి దేవాలయంలో శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు జరిపించారు.ఉదయం 10 గంటల 45 నిమిషాల నుండి ధనుర్లగ్న పుష్కరాంశంలో ధ్వజ శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత వైభవంగా వేదోక్త పూర్వకంగా కార్యక్రమాలు జరపబడినవి.సాయంత్రం సామూహిక హెూమాలు,జలదివాస కార్యక్రమాలు జరిగాయి.మరియు రాత్రి 9 గంటల నుండి తలుపుల నల్లచెరువు మండలాలకు చెందిన శ్రీ సీతా రామ చెక్కభజన మండలి వారి ఆధ్వర్యంలో చెక్కభజన కార్యక్రమం కనుల విందుగా మనోరంజకంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనరసింహ గౌడ్ స్వామి,రఘునాథరెడ్డి స్వామి, అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు అందరూ పాల్గొని దిగ్విజయంగా ధ్వజ శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

# ప్రైవేటీకరణపై ఉద్యమం ఆగదు

- మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తున్నాం
- ప్రజల్లో జగనన్నకు మంచి పేరు రాకూడదన్న ఉద్దేశంతోనే చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తోంది: కాకాణి పూజిత

**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 8:** సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, కసుమూరు గ్రామ పంచాయతీలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. ఈ సందర్భంగా కాకాణి పూజిత మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మేము సైతమంటూ, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.జగన్మోహన్ రెడ్డి కష్టపడి రాష్ట్రానికి తీసుకుని వచ్చిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు పూర్తి చేయలేక, ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెబుతున్నారు.-జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేసిన మేలు ప్రజలకు అర్థమవుతుందని, ప్రజల్లో జగనన్నకు మంచి పేరు రాకూడదనే ఉద్దేశ్యంతో చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తుంది.చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలతో మోసం చేసినట్లే, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో ప్రజలకు నష్టం చేకూరుస్తున్నారు.చంద్రబాబు తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయంతో, పేద కుటుంబాలకు వైద్య విద్యతో పాటు, వైద్యాన్ని కూడా దూరం చేస్తుంది.ప్రజలు అనేక నిరసనలు తెలియజేస్తూ, వ్యతిరేకిస్తున్నా, చంద్రబాబు ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు.మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తున్నాం.చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనుకకు తీసుకుని, చేసిన తప్పును సరిదిద్దుకునేంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది.జగనన్నకు అండగా, కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి మద్దతు తెలుపుతున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.






## మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా రాధిక యాదవ్

**గుత్తి, సూర్య వాస్తవం, నవంబర్ 8:** గుత్తి పట్టణ వైఎస్ఆర్సీపీ కన్వీనర్ కప్పలబండ మధు సూదన్ రె డ్డిని వారి స్వగ్రుహంకు విచ్చేసి మర్యాద పూర్వకంగా కలిసిన అనంతపురం మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధిక యాదవ్



# కురుబలను గుండెల్లో పెట్టుకుంటా!

(మొదటిపేజీ తరువాయి)

జరుపుకోవడం నా అదృష్టం. కనకదాస గారు గొప్ప పాటలతో శ్రీకృష్ణుడుని తన వైపు తిప్పుకున్నారు. ప్రజల్లో దైవ భక్తిని పెంచారు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఆయన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారు. చిన్నతనంలో బాగా చదువుకున్నారు. సైన్యంలో చేరి యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆయన జీవితాన్ని భక్తికి, ప్రజలకు అంకితం చేశారు. ఒక రోజు కనకదాస గారిని ఆయన గురువు నీకు మోక్షం పొందాలని లేదా అని అడిగారు. అప్పుడు కనకదాసు గారు అహంకారం అనేది పోతే మోక్షం వస్తుంది అని చెప్పిన గొప్పవ్యక్తి ఆయన. కనకదాసు గారి జీవితం మనకు స్ఫూర్తి. ఆయన చూపిన మార్గంలో సమాజం నడవాలి.

**భైరవానితిప్ప ప్రాజెక్టును పూర్తిచేస్తాం**

భైరవతిప్ప ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది టీడీపీ, పూర్తిచేసేది కూడా టీడీపీనే. జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. కరువుసీమలో కార్ల పంట పండించిన చరిత్ర టీడీపీది. నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు ఇప్పుడు పరిశ్రమలు తెస్తున్నాం. జిల్లాలో హార్టికల్చర్ కు సాయం అందిస్తాం. తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉన్న జిల్లాను 3వ స్థానంలోకి తీసుకొస్తాం. దశాబ్దాలుగా మన జిల్లాలో ఆర్ డీటీ సంస్థ అనేక సేవలు అందిస్తోంది. హాస్పటల్స్, పాఠశాలలు, స్వయం ఉపాధి పరంగా సేవలు చేస్తున్నారు. వారి లైసెన్సు పునరద్ధరణ ఆలస్యమైంది. నేను బాధ్యతగా తీసుకుని కేంద్రంతో మాట్లాడి లైసెన్సును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నాం.. ఇకపై వారి కార్యక్రమాలను ముందుకు తీసుకెళతాం. బీసీ సోదరులు ఒక విషయాన్ని ఆలోచించాలి. టీడీపీ వల్లే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది. 3,132 కి.మీ.లు పాదయాత్ర చేసినప్పుడు ఉపకులాలను కలిశా. మీ సమస్యలను నేరుగా తెలుసుకున్నా, ఆ సమస్యలను పరిష్కరించే వరకు నిద్రపోను. ఫైర్ బ్రాండ్ మంత్రి సవితమ్మ మీకు ఉన్నారు. చెప్పిన పని అయ్యేవరకు ఆమె వదిలిపెట్టరు. బీసీ సంక్షేమ మంత్రిగా ఆమెకు కూడా బాధ్యత ఉంది. ఇచ్చిన హామీలను మనం నిలబెట్టుకోవాలి. ఎంపీ పార్థసారధి కేంద్రంతో పోరాడుతున్నారు, నిధులు తెచ్చేందుకు కష్టపడుతున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలతో కురుబలకు అనుసంధానం చేసి ముందుకు తీసుకెళ్లండి.



**అనంతపురం జిల్లాకు రుణపడి ఉంటాం**

ఉమ్మడి అనంతపురం జిల్లాకు మా కుటుంబం రుణపడి ఉంటుంది. ఎన్టీఆర్ ను 3సార్లు శాసనసభకు పంపించింది. నా మామ నందమూరి హరికృష్ణ గారిని ఒకసారి గెలిపించారు, మరొక మామ బాలకృష్ణను మూడుసార్లు గెలిపించి శాసనసభకు పంపిన గొప్పనేల అనంతపురం. ఈ నేలకు మేము ఎంతచేసినా తక్కువే. మా జీవితాంతం మీకు రుణపడి ఉంటాం. అనంతపురం అంటే టీడీపీ, టీడీపీ అంటేనే అనంతపురం. టీడీపీని కురుబలు గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటూ వస్తున్నారు. కురుబలకు రాజకీయంగా, ఆర్థికంగా స్వాతంత్ర్యం వచ్చింది టీడీపీతోనే. కురుబ సోదరులు మొదటి నుండి తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు. ఎన్టీఆర్ గారి దగ్గర నుంచి చంద్రబాబు గారి వరకు కురుబలు అంటే ప్రత్యేక ప్రేమ. కురుబలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసింది టీడీపీ. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం కురుబ సామాజికవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. కురుబ కార్పొరేషన్ ను టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కురుబ కమ్యూనిటీకి వివిధ సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేసింది. గొర్రెల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు, బీమా కూడా ఇచ్చాం. 50% సబ్సిడీతో 4 లక్షల వరకు రుణసౌకర్యం కల్పించాం. కురుబ కమ్యూనిటీ భవనాలు నిర్మించాం. కురుబ సామాజిక వర్గాన్ని రాజకీయంగా టీడీపీ ప్రోత్సహించింది. ఎస్.రామచంద్ర రెడ్డి గారు 14 శాఖలతో మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. బీకే పార్థసారథి ఎంపీగా, ఎమ్మెల్యేగా, జడ్పీ ఛైర్మన్ గా పనిచేశారు. సవిత గారు గతంలో కురుబ కార్పోరేషన్ ఛైర్మన్ గా పనిచేసి, నేడు మంత్రిగా పనిచేస్తున్నారు. కురుబ సాధికార రాష్ట్ర సభ్యుడు బస్తిపాటి నాగరాజు గారు ఇప్పుడు కర్నూలు ఎంపీ. అనంతపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, కర్నూలు జడ్పీ ఛైర్మన్ బత్తిన వెంకట రాముడు కురుబ సామాజికవర్గానికి చెందిన వారు. చాలా మందికి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవులు కూడా లభించాయి.



**వైసీపీ హయాంలో చీకటిరాజ్యం**

2019 నుంచి 2024 వరకు చీకటి రాజ్యం చూశాం. బీసీ సోదరుల్లో తిరుగుబాటు వచ్చింది. 94శాతం సీట్లతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. పాదయాత్రలో కురుబ సోదరులు కనకదాసుగారి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నన్ను కోరారు. వారి కోరిక మేరకు అధికారికంగా కనకదాసు జయంతిని నిర్వహిస్తున్నాం. బెీరప్ప పేరుతో గుడులను టీటీడీ సహకారంతో కట్టిస్తాం. పూజారులకు త్వరలోనే గౌరవవేతనం అందజేస్తాం. గతంలో కురుబ సోదరులకోసం అనేక కమ్యూనిటీ భవనాలు ప్రారంభించాం. అసంపూర్తిగా నిలిచిపోయిన కురుబ భవనాలను వచ్చే 12నెలల్లో పూర్తిచేస్తాం. ఆదరణ పథకం కింద పనిముట్లు అందించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తాం. కురుబ సోదరులకు ఇన్సూరెన్స్, షెడ్లు కోరారు. పంచాయితీరాజ్ మంత్రిగా ఉన్న పవనన్న ఆవుల కోసం షెడ్లు ఏర్పాటుచేస్తున్నారు. ఆయనతో మాట్లాడి కురుబల కోసం షెడ్లు ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. యువగళంలో నేను ఇచ్చిన అన్ని వాగ్దానాలను గుర్తుంచుకున్నాను. నా పాదయాత్రలో నేను కురుబ సమాజాన్ని కలిసి, వారి బాధలను ప్రత్యక్షంగా చూశాను. కనకదాసు గారి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నేడు నెరవేర్చాం, బెీరప్ప దేవాలయాలను నిర్మించడానికి ప్రభుత్వం సహాయం చేస్తుంది. కురుబ పూజారులకు గౌరవవేతనం జీవో త్వరలో విడుదల చేస్తాం. కురుబల దేవాలయాలకు పూజాధికాల కోసం ఆర్థికసాయం అందిస్తాం. బీమా పథకాన్ని ఎలా అమలు చేయాలో పరిశీలన చేస్తాం. మేత భూములు, దాణా, మందులు, షెడ్‌లు వంటి సమస్యలను కురుబ సోదరులు నా దృష్టికి తెచ్చారు. వాటన్నింటినీ ఈ ప్రజాప్రభుత్వం తప్పకుండా పరిష్కరించి, మీ ఆదాయాన్ని మెరుగుపర్చేందుకు కృషిచేస్తుంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి కురుబ సవిత, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ పార్థసారధి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, కురుబ కార్పోరేషన్ ఛైర్మన్ దేవేంద్ర పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో

# నారా లోకేష్ ప్రజాదర్బార్

**కళ్యాణదుర్గం, సూర్యవాస్తవం :** అనంతపురం జిల్లా రెండు రోజు పర్యటనలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. కళ్యాణదుర్గం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద 71వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతిఒక్కరిని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లిన తన సోదరి షేక్ జుబేదా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, సరైన తిండి లేక అనారోగ్యం పాలైన ఆమెను క్షేమంగా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గుంతకల్లుకు చెందిన షేక్ షబానా మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. తన ఇద్దరు కుమార్తెల ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం అందించాలని అనంతపురానికి చెందిన మదమంచి ప్రవీణ్ కుమార్ మంత్రి నారా లోకేష్ కలసి కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా ఉప్పరపల్లిలో తాను ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని కొనుగోలుచేశానని, అయితే రామకృష్ణారెడ్డి, కుమారస్వామిరెడ్డి అనే వ్యక్తులు దౌర్జన్యపూరితంగా తన స్థలాన్ని ఆక్రమించారని పుట్టపర్తి మండలం గువ్వలకుంటపల్లి గ్రామానికి చెందిన ఈ.సురేంద్ర రెడ్డి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మౌక్తికాపురంలోని గత 40 ఏళ్లుగా 110 ముస్లీం మైనార్టీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తమ గ్రామానికి చెందిన 4.86 ఎకరాల స్మశాన స్థలాన్ని ముద్దినాయనపల్లికి చెందిన ఈ.అశోక్ ఆక్రమించి తప్పుడు పత్రాలతో ఆన్ లైన్ లో నమోదు చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది మంత్రి లోకేష్ ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.









# స్కూల్ బస్సుల భద్రతే ప్రాధాన్యం

**డ్రైవర్లు నియమ నిబంధనలు పాటించాలి**
**నాయుడుపేట డీఎస్పీ జి. చెంచుబాబు**
**మద్యం సేవించి బస్సులు నడిపితే కఠిన చర్యలు**
**డ్రైవర్ లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి**
**ఆర్టీవో బి. అనిల్ కుమార్**
**డ్రైవర్లు, యాజమాన్యం, తల్లిదండ్రులు భద్రతా బాధ్యతగా వ్యవహరించాలని సూచన**

**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 8:** విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి డ్రైవర్, స్కూల్ యాజమాన్యం మరియు తల్లిదండ్రుల బాధ్యత అని నాయుడుపేట డీఎస్పీ జి. చెంచుబాబు తెలిపారు. విద్యార్థులను బస్సుల్లో తీసుకువెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ఏ.ఎల్.సి.ఎం హైస్కూల్ గ్రౌండ్లో పోలీస్ శాఖ - రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ బస్సుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట, చిట్టమూరు, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం మండలాలకు చెందిన ప్రముఖ విద్యాసంస్థలైన విజన్, గోకుల కృష్ణ, శ్రీ ఉషోదయ, సన్ మేరీస్, వేమా, నవోదయ, భాష, టీఎంఆర్ కాలేజ్, శ్రీ చైతన్య, హరి విశ్వ భారతి, నవ భారతి స్కూల్ల డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ "డ్రైవర్లు బస్సులను గుడిలా



చూసుకోవాలి. మద్యం సేవించి స్కూల్ వాహనాలు నడిపితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు. విద్యార్థుల ప్రాణాలు మన చేతుల్లో ఉన్నందున ప్రతి డ్రైవర్ తన వాహనాన్ని సురక్షితంగా నడపాలి. పిల్లలు సురక్షితంగా ఇంటికి చేరడం మనందరి బాధ్యత" అని అన్నారు. సూళ్లూరుపేట ఆర్టీవో బి. అనిల్ కుమార్ మాట్లాడుతూ "ప్రతి స్కూల్ బస్సుకు లైసెన్స్, డ్రైవర్ ఫిట్నెస్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ విండో, ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. బస్సులకు ఎఫ్సీ, బాడీ ఫిట్నెస్,



ఇన్సూరెన్స్, రూట్ టాక్స్ వంటి పత్రాలు సక్రమంగా ఉండాలి. విద్యార్థుల భద్రతను కాపాడేందుకు ఇది ప్రతి స్కూల్ యాజమాన్యం కర్తవ్యం" అని సూచించారు. నాయుడుపేట అర్బన్ సీఐ బాబి మాట్లాడుతూ "ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అనుభవం ఉన్న సీనియర్ డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. పిల్లల ప్రాణాల భద్రత కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి. చిన్న తప్పిదం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది" అని సూచించారు. తరువాత డీఎస్పీ చెంచుబాబు, ఆర్టీవో అనిల్ కుమార్, సీఐ బాబి స్వయంగా ప్రతి స్కూల్ బస్సును పరిశీలించారు. బస్సుల యాంత్రిక స్థితి, భద్రతా ప్రమాణాలు, అవసరమైన పత్రాలు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు పరిశీలించి సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల భద్రతపై ప్రతి డ్రైవర్, యాజమాన్యం మరియు తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

# పోర్టులో లంగర్ వేసిననౌకలు

**వాణిజ్య రంగంలో ఏకేపీఎల్ ఘనవిజయం**
**ఐదు నౌకలు, రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల దిగుమతి**
**ఏకేపీఎల్ సీఈఓ జగదీష్ పటేల్**

**ముత్తుకూరు, సూర్య వాస్తవం, నవంబర్ 8:** అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ వ్యాపార వాణిజ్య రంగంలో ఘనవిజయం సాధించింది. శనివారం కృష్ణపట్నం పోర్టులోఐదునౌకలు నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను దిగుమతి చేసింది. అదానీ పోర్ట్స్ , సెజ్ లిమిటెడ్ యొక్క అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ మొత్తం 2,23,419 మెట్రిక్ టన్నుల సరుకును ఏకకాలంలో ఐదు నౌకలను నుంచి ఎరువుల ను సమర్థవంతంగా దిగుమతి చేసుకొని రవాణా చేయడంద్వారా మైలురాయి కార్యాచరణ ఘనతను సాధించింది. ఏకేపీఎల్ అధునాతన మౌలిక సదుపాయాలను, భారతదేశ వ్యవసాయ సరఫరా గొలుసును బలోపేతం చేయడంలో కృష్ణపట్నం పోర్టు కీలక పాత్రను నిర్వహిస్తుంది. వ్యవసాయ సరుకుల మొత్తం పరిమాణాన్ని వివిధ గోడౌన్లలోకి వేగంగా దించి, రైలు రేక్లు తో పాటు రహదారి రవాణా దేశవ్యాప్తంగా వ్యవసాయ ప్రాంతాలకు పంపినారు. ఏకేపీఎల్ అత్యాధునిక ఆటోమేటెడ్ ఫెర్టిలైజర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ నౌకలకు శీఘ్ర టర్నరౌండ్ సమయాలను నిర్ధారించి ఎరువులు రైతులకు వెంటనే చేరుకోవడానికి వీలు కల్పించింది. ఓడరేవు యొక్క ఉన్నతమైన రైలు, రహదారి అనుసంధానం ద్వారా దేశవ్యాప్తంగా పంపిణీని మరింత సులభతరం చేసింది. వ్యవసాయ సమాజాన్ని శక్తివంతం చేయడానికి భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు మద్దతు ఇచ్చింది. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఐదు నౌకలలో రెండు లక్షల టన్నులకు పైగా ఎరువులను విజయవంతంగా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. అధునాతన మౌలిక సదుపాయాల సమర్థత, వ్యవసాయ రంగం పట్ల అంకితభావాన్ని ప్రదర్శిస్తుందన్నారు. అదానీ కృష్ణపట్నం నౌకాశ్రయం వద్ద, రైతులకు అవసరమైన వ్యవసాయ ఎరువుల దిగుమతులను సకాలంలో




సమర్థవంతంగా రవాణ చేయడంపై మా దృష్టి ఉందన్నారు. వ్యవసాయ సమాజంలో స్థిరమైన వృద్ధిని పెంచుతుందని సీఈఓ అన్నారు. ఈ విజయం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా, దేశానికి మద్దతు ఇచ్చే సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి ఏకేపీఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేర్కొన్నారు. భారతదేశ తూర్పు తీరంలో ఎరువుల దిగుమతులు , రవాణ కీలకమైన కేంద్రంగా ఎకెపిఎల్ తన స్థానాన్ని బలోపేతం చేస్తూనే ఉందన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఏకేపీఎల్ ఉద్యోగస్తులు కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎలన్ మస్క్‌కు 88 లక్షల కోట్లు ప్యాకేజీ



**న్యూయార్క్, సూర్య వాస్తవం, నవంబర్ 8:** మనదేశంలో అత్యధిక వేతనాలు తీసుకొనే ప్రైవేట్ కంపెనీల అధినేతలలో ముకేశ్ అంబానీ, కావేరి మారన్, రోషిణి నాడార్, ఆనంద్ మహీంద్రా ముందు వరసలో ఉంటారు. వీరి వార్షిక వేతనం కోట్లల్లో ఉంటుంది. ప్రతి ఏడాది వీరి వేతనం పెరుగుతూనే ఉంది. పెరిగిన వేతనం ద్వారా వీరు రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు.. కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త ఘనతలను అందుకుంటునే ఉన్నారు. మన దేశం గురించి కాస్త పక్కన పెడితే.. ప్రపంచంలోనే అత్యధిక వేతనం తీసుకుంటున్న వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు టెస్లా అధినేత మస్క్.టెస్లా.. ఎక్స్, స్పేస్ ఎక్స్ కంపెనీల అధినేతగా.. ప్రపంచ కుబేరుడిగా పేరుపొందాడు మస్క్. ఇంకా తన వ్యాపారాలను మరింత స్థాయికి విస్తరించడానికి ఆయన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెస్లా కార్ల విక్రయాల ద్వారా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. అటువంటి మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారం లోకి కూడా అడుగు పెట్టారు. త్వరలోనే భారతదేశంలో సేవలు అందించబోతున్నారు. దీనికి సంబంధించి అనుమతులు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో మస్క్ మరో రికార్డు సృష్టించారు. కార్పొరేట్ ప్రపంచం కనీ విని ఎరుగని ఘనతను ఆయన అందుకున్నాడు. అమెరికా ఎన్నికల్లో ట్రంప్ తరఫున ప్రచారం చేశాడు మస్క్. ట్రంప్ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర కూడా పోషించాడు. ఆ తర్వాత ఆ స్థానం నుంచి తప్పుకున్నాడు. ట్రంప్ తో తనకు విభేదాలు ఉన్నాయని పేర్కొన్నాడు. ట్రంప్ తో స్నేహం ముగిసిన అధ్యాయమని మస్క్ వెల్లడించాడు.. ఇక ఇప్పుడు మస్క్ కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించాడు. ఆయనకు వన్ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి టెస్లా కంపెనీకి చెందిన 75 శాతం షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. వన్ ట్రిలియన్ డాలర్లు అంటే దాదాపు 88 లక్షల కోట్లు. ఫలితంగా కార్పొరేట్ ప్రపంచంలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఆయన చరిత్ర సృష్టించాడు. అయితే మస్త్ నెల జీతం గా కాకుండా.. ఆ మొత్తాన్ని వచ్చే పది సంవత్సరాలలో స్టాక్స్ రూపంలో ఆయన పొందుతారు. ప్రస్తుతం 476 బిలియన్ డాలర్ల సంపద తో మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్నాడు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854